కాళ్ళమీద చెంబెడునీళ్ళు పోసింది.

కౌగిలింతలోనే యింటోకి తీసుకువెళ్ళింది.

"చిక్కి కండ అయిపోయావుగదే చిట్టితల్లీ" అంటూ మమకారం గుమ్మరించింది.

పెరట్లోకి బయలుదేరగా కూడా వచ్చి కాళ్ళూ మొగమూ కడుక్కోడానికి నాలుగుబాల్చీల నీళ్ళున్నూ తోడియిచ్చింది.

అయినా సుందరి కేదో లోటుగానే కనిపించింది.

కామేశ్వరి పలకరించాటప్పటికి మాత్రం ప్రాణాలు లేచి వచ్చాయి.

ఇటు కామేశ్వరికిన్నీ పెన్నిధి దొరికిన ట్టనిపించింది.

దాంతో "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకీ? రాజమహేంద్రవరం మరిచిపోయావనుకున్నాను వదినా" అంటూ ముందు తన సంబరం కనబరిచి, తరవాతే ప్రీతిగా అడిగిందామె "ఎంతసేపయిందీ వచ్చి?" అని.

"వచ్చాను, నూతిదగ్గిర మొగం కడుక్కున్నాను, నువ్వు పిలచావు, అంతే"

"కులాసాగా వున్నావా?"

"ఆ"

ఇలా అంది సుందరి; కాని "వదినకు తెలియదింకా" అనిన్నీ అనుకుని, చిరునవ్వు రాగా సిగ్గుపడిపోయిం దామె.

దీనికి సాయం తల్లి సుబ్బమ్మ అందుకుని "ఏమి నటనే మాతల్లీ? సవతి ఆడబడుచు క్షేమం కావలిసివచ్చిందా? యీ సింగమ్మకీ? శాబాసునే" అంటూ కళ్ళుతిప్పుకుని, "అన్నం సయించడం లేదని చెప్పావు సుమా" అంటూ మూతి బిడాయించుకుంది.

అత్తగా రేదో అంటున్నట్టు గ్రహించేసింది కామేశ్వరి; కాని స్పష్టంగా వినపడక, లాభం లేదని ఆస్మరణే విడిచిపెట్టేసి "అన్నయ్యగారు కులాసాగా వున్నారా వదినా?" అనడిగింది, మళ్ళీ పైకి చూస్తూ.

"కులాసాగానే వున్నారమ్మా! నేనెక్కి వచ్చిన రెయిల్లోనే ఆయన చెన్నాపట్టం వెళ్ళారు, నేనిక్కడ దిగాను"

"పనిమీద వెళ్ళినట్టున్నా" రంది కామేశ్వరి; కాని సుందరి కామాట వినపడకుండా "ఆమాట చెప్పడం యెందుకే ఆ నంగనాచితోనూ?" అంటూ రుంజుకుంది సుబ్బమ్మ, కంఠం నొక్కుకుని.

అంతే.

మరి, అవతల అలికిడి కూడా లేనట్టనిపించింది.

అత్తగారు, చెయ్యిపట్టుకుని సుందరిని లోపలికి తీసుకువెళ్ళి వుంటుం దనుకుంది కామేశ్వరి.

దీనికి సాయం, లోపల పొయ్యి మండిపోతూ వుండడం జ్ఞాపకంవచ్చి, సగంసగం కడిగిన బియ్యం గబగబా కడిగేసి, ఒక్క అంగవేసింది వంటింటో కామె.

## 2

కూచోమన్నట్టు చూస్తూ పీటపరిచి "కసిన్ని పాలచుక్కలు పుచ్చుకుం టావా తల్లీ?" అనడిగింది కూతుర్ని, సుబ్బమ్మ.

"పాలువద్దు. కాఫీ చెయ్యవే" అంటూ గునిసింది సుందరి; కాని, సుబ్బమ్మ, అందు కిష్టపడక "ఇక కాఫీ మంచిది కాదమ్మా నీకు. నువ్వా— నీమొగుడూ కూడా పచ్చగా దబ్బపళ్ళలా వున్నారు, నల్లని కాఫీకషాయం కడుపులోకి వెళ్ళడం నీకిక మంచిది కాదు. అంత యిష్టం లేకపోతే మరింత పంచదార కలుపుకుని పాలే పుచ్చుకోమ్మా, బలంకూడా చేస్తుంది" అంది గడ్డం పుణుకుతూ.

అయినా "వద్దమ్మా" అంది సుందరి.

"సామర్లకోట స్టేషనులో కాఫీ పుచ్చుకున్నాం; కాని నోటికి పోయిందే కాదు, వొట్ఠి బెల్లప్పానకం యిచ్చాడు వెచ్చబెట్టి, అయిన రెండణాలూ కాజేసి. తలనొప్పిగా కూడా వుంది" అనికూడా అందామె, కుడిచేతి అంగుష్ఠంతోనూ అనామికతోనూ నుదురు నొక్కుకుంటూ.

ఉలిక్కిపడిపోయింది సుబ్బమ్మ.

"వొళ్ళు వెచ్చగా లేదుకదా?" అంటూ అమాంతంగా వెళ్ళి కడుపు నిమిరింది.

"రెయిల్లో యెక్కడెక్కడివాళ్ళూ వచ్చి అరిటికాయలు కావేసినట్టు మడతొక్కు క్కూచుంటున్నారు కాదూ? దూరప్రయాణం కనక బడలిక చేసింది, అంతే" అంటూ అంతలో స్తిమితపడి "అయితే నీయిష్టం తల్లీ, మీకేం వుద్యోగస్థు లయిపోయేవాళ్ళయితిరి, పాలుపనికివస్తాయా మరీ? కాఫీ చేసే యిస్తాలే అమ్మా, యిలా కూచో" అంటూ ఆమె మొగం నిమిరి, రెక్క పట్టుకు తీసుకువెళ్ళి పీటమీద కూచోబెట్టి, తాను కుంపటి దగ్గిర చతికిలబడింది, గుప్పెడు కొబ్బరిపీచు అంటించి.

ఇంతలో శేషాచలం వచ్చా డక్కడికి.

"రా నాన్నా! నాన్న కూడా పుచ్చుకుంటాడు తొరగా చెయ్యవే అమ్మా" అంది సుందరి, తండ్రిని చూసి పీట దిగబోతూ.

"నాకు కాఫీ వద్దు, నువ్వు పీటా దిగవద్దు" అంటూ ఆత్రంగా వెళ్ళి కూతురికి దగ్గిరగా కూచున్నాడు శేషాచలం.

"మూడణాలు పోతేపోయాయి; స్టేషనుకి రిక్షామీద రాక నాకోసం నడిచి వచ్చావు పాపం, శ్రమకాదూ? ఉల్లాసంగా వుంటుంది. కసింత కాఫీ పుచ్చుకో నాన్నా" అంటూ తండ్రిని వొప్పించి "అయితేనూ? అన్నయ్యా వేరుండడం యెందుకు వచ్చింది నాన్నా?" అనడిగింది చివరికి సుందరి.

సుబ్బమ్మ కళ్ళు చిమచిమలాడాయి.

దీనికి సాయం అవ్యవధానంగా "మీఅమ్మ నడుగు" అన్నాడు శేషాచలం, తాను చెప్పడం మానేసి వూరుకోక.

దీనిమీద ముందు మూతి బిడాయించుకుని తల తాటించుకుంది సుబ్బమ్మ వొక్కమాటు.

"అమ్మాయి నన్నడగలేదా అదడిగితే నేను చెప్పనా, మధ్య మీ పురమాయిం పెందుకూ మహా తీర్పు తీర్చేటట్లూ?" అంటూ కస్సుమంది తరవాత.

శేషాచలం మొగం పక్కకి తిప్పుకుని వూరుకున్నాడు.

సుందరి తండ్రికేసి బిక్కుబిక్కు చూసింది.

అప్పటికీ భర్తకేసి పులుకూ పులుకూ చూస్తూనే వున్న సుబ్బమ్మ, అతనియెడల యీసడింపుగా ముక్కూ మొగమూ ముడుచుకుని, తరవాత కూతురికేసి తిరిగి "పనికట్టుకుని మళ్ళీ నువ్వడిగే దేమిటి వినవే అమ్మాయీ" అంటూ అందుకుని "మొన్నటి విఘ్నేశ్వరచవుతికి ఖరాగా పాతికేళ్ళునిండాయి. నాలుగేళ్ళయి అవిడకూడా వచ్చి పుట్టింట గుప్పెడు మెతుకుల కాస్కారం లేక పండుగుపబ్బాల క్కూడా కదలకుండా కణాయించుక్కూచుంది. బి.ఏ అనిపించాక గూడా వొక్క దమ్మిడీ అయినా తెచ్చి నాచేతిలో పెట్టకపోతే యింకెన్నాళ్ళు మేపమంటావే కూచోబెట్టి మరీ?" అనడిగింది తల యెగర వేసుకుంటూ.

ఈమాటతో కడుపు దేవేసినట్టయి, మాట్టాడలేక, కూతురికేసి మాత్రం వొక్కమాటు దీనంగా చూసి మళ్ళీ మొగం పక్కకి తిప్పేసుకున్నాడు శేషాచలం.

అతని వాలకం చూడగా, సుందంకి, వయసు పెరిగినకొద్దీ తల్లి యెంత రాకాసి అవుతోందో స్పష్టంగా తెలిసిపోయింది.

దాంతో పాటు తన భర్త అప్రయోజకత్వం కూడా స్ఫురించగా, ఒక్క చూపులో తన దీనావస్థ గూడా తండ్రికి సూచించి "మరి, దినం యెలా గడుస్తోందే పాపం, అన్నయ్యకీ?" అనడిగింది జాలిగా, తల్లిని.

"గడిస్తే నాకేం, గడవకపోతే నాకేం? గడిస్తే మాత్రం నాకేమయినా యివ్వాలా, యివ్వకపోతే దేహీ అంటూ నేను దేవురిస్తానా? కనిపారేసింది, వేంచేసిం దావిడ. వూళ్ళోవాళ్ళ వూచీ నాకేం అందరిదీ?"

ఇలా అడిగి వొక్క క్షణం నిలవతీస్తున్నట్టు చూసి "దినమ్మా కొంత మూరు వెళ్ళి పెద్దరెడ్డి కొడుక్కింగ్లీషు చెబుతున్నాట్ట కాదూ? నెలకి అరబస్తా బియ్యమూ పదిహేను రూపాయల రొక్కమూ యిస్తాట్ట రెడ్డి, తక్కువేం?" అంటూ విసనకర్ర పుచ్చుకుని కుంపటికేసి తిరిగింది సుబ్బమ్మ.

"సరిపోతాయా పాపం?"

"చాల్తే నాకు హెం.గా, చాలకపోతే బెంగా?"

"...................."

"కాఫీ మాన్పించేసిందిట లే రాణీగారు. ఆవిడ మాట కద్దు చెప్ప లేదుగా?"

ఇలా అడిగి, కూతురికేసి ప్రశ్నార్థకంగా చూసింది సుబ్బమ్మ.

"నీ అల్లుడుగారూ అంతే, నువ్వేమీ బెంగపెట్టుకోనక్కర్లే" దన్నట్టు బదులు చూపు లందించి "పోనీ, నువ్వేమయినా యిస్తున్నావా నాన్నా?" అని తండ్రి నడిగింది సుందరి.

గుడ్లనీరు కుక్కుకుంటూ శేషాచలం మొగం వంచుకుని వూరుకున్నాడు.

అంతకి ముందే పురపురచూస్తూ అందుకుని "ఆ, యిస్తారు మీనాన్న! ఊహ ల్లేవనా? కాని యేం వుందనీ యివ్వడానికి మహా? నెలకి ముప్పాతిక రూపాయలేనా చచ్చు పింఛను వస్తుందీ? తెచ్చిన్నాడే నాచేతిలో పొయ్యకపోతే యీ సంసారం గడపడం నాతరమా?" అనడిగింది, సుబ్బమ్మ ముందు.

"ఒక్కపూట అయినా - కొడుకుని చూసయినా కాఫీ మానుకోరుగదా మీనాన్న?" అంటూ చురుగ్గా చూసింది, తరవాత.

శేషాచలం నిలువునా నీరయిపోయాడు.

తుళ్ళిపడి సుందరి తండ్రికేసి ఆత్రంగా చూసింది.

భర్త అలా అయినా కూతు రిలా అయినా అంతటితో వూరుకోక

సుబ్బమ్మ "ప్రయోజకుడు కనక, చేసింది రోడ్డు గుమాస్తావనే అయినా పాతిక యకరాల భూమి సంపాదించాడు మా నాన్న. ప్రేమ వుంది కనక, యిక్కడి లుగసాను చూసి నాకో నాలుగు యకరా లిచ్చాడు కొడుకులతో సమంగా వాటా పెట్టి. అవే లేకపోతే కడుపునిండా బువ్వేదీ మాకూ? అన్నాళ్ళు సబురిజిస్ట్రారు పని చేశారు, వొక్క రూపాయయినా సంపాదించగలిగారా మీనాయన, పైగా గుడివాడలో వున్నప్పుడు కట్టకాసులపే రొకటీ, మువ్వలవడ్డాణం వొకటీ యెంతో బలవంతం చేస్తూ వొకకమ్మ ఆవిడ చేతిలో పెట్టింది నాకు, అల్లుడు రాసిన విల్లు రిజస్టరీ చేయించ మని. గిజా అన్నారుగాని నామాట విన్నారా మీనాన్న? ఒక్క బరుకు బరికేస్తే వేలకు వేలు చేతిలో పడే కేసు లింకా యెన్ని విడిచిపెట్టేశారో మీ నాన్న నువ్వేరుగుదువా? అప్పుడలా మడికట్టుకూర్చుని వుండకపోతే మోటార్లమీద తిరుగుతూ వుండమూ మన మిప్పుడు? ఒక కొత్త నగ అనా, కొత్తచీర అనా యేమనుభవిస్తున్నా నే నే నిప్పుడూ? ఏడాదికి రెండు పట్టుచీర లేనా కొంటున్నా న్నీకు? చిలక్కి చెప్పినట్టు చెప్పాను మొన్నటిదాకా గోళ్ళు గిల్లుకుంటూ యింటో కూచోక ఆ రిజస్ట్రారు ఆఫీసుదగ్గర కూచోమని. అదయినా విన్నారా పోనీ? ఇస్తారు, ఇవ్వకేం, నెలగో నెలగ" అంటూ చేతులూ కళ్ళూ తేలవేసుకుంది, పెదవి విరుస్తూ,

కొరడా దెబ్బ తిన్న ట్టయి, దిగ్గున లేచివెళ్ళిపోయాడు శేషాచలం.

కుంపటి విసరడం మానేసి "నన్నేం వుద్ధరిస్తారా?" అంటూ కూడా యీసడించి, అతను కనబడ్డంతసేపూ పులుకూ పులుకూ చూస్తూనే వుంది సుబ్బమ్మ.

"అయ్యో, పాపం కాఫీ పుచ్చుకోకుండా—" అంటూ తల్లడిల్లిపోయింది సుందరి; కాని "ప్రపంచం మునిగిపోదులే యింతట్లో?" అంటూ రుంజుకుని పాలగిన్నెకోసం వసారా గదిలోకి చక్కాపోయింది సుబ్బమ్మ.

## 3

"సుందరమ్మవదిన వచ్చింది" అని చెప్పింది కామేశ్వరి, ఇటు తలుపు తెరిచి గోపాలశాస్త్రి అటు హాల్లో అడుగుపెట్టాటప్పటికి, సంబరపడుతూ.

వెంటనే గోడమీదుగా చూస్తూ "చెల్లీ" అని పిలిచాడతను, జోడు విడవ కుండానే.

"ఆ, వచ్చావా అన్నయ్యా?"

ఈమాటలో యెంతో ప్రీతి కనబడి హృదయం చల్లబడగా "వచ్చా నమ్మా?" అన్నా డతను, గద్గదికతో.

"ఏమి చెప్పుకోను నాన్నా? ఎల్నాటికని విడిచిపెట్టలేదు నన్నింకా" అంది సుందరి, నీరసంగా నట్టింట చతికిలబడుతూ.

శేషాచలానికి వొణుకు పట్టుకుంది.

గోపాలం పిలుపుతో సంబరపడుతూ వెళ్ళిన పిల్ల అతని మాటలతోనే యిలా అయిపోడం చూడగా, అతని కేదో మూడుతుం దనిపించిం దతనికి.

"అదేమి టమ్మా?" అని మాత్రం అనగలిగా డతనీ బెంగతో.

"ఇప్పు డేం వచ్చిందే విస్తరి దగ్గిర కూచున్నదానికీ?" అంటూ గభీమని ముట్టుకుని సుందరిని పొదువుకుంది సుబ్బమ్మ, ఆత్రంగా చూస్తూ.

దీనికి "అన్నయ్య నావిస్తట్లో అన్నాని కాళపడుతున్నాడు" అని మాత్రం చెప్పి తల్లిమీద వాలిపోయింది, సుందరి.

ఒక్క చరుపు చరిచిన ట్టయిం దెవరో, సుబ్బమ్మకి.

"ఏమిటీ? వాడి దుంపతెగ, ఏంచేస్తున్నా డూ?" అంటూ వురిమిందామె. కంఠంమాత్రం నొక్కుకుని.

"మీఅల్లుడుగారు తంటాలుపడుతున్న వుద్యోగానికే యెగబాకుతున్నా డన్నయ్య" అని బదులు చెప్పింది సుందరి, కళ్ళు తేలవేసుకుంటూ.

"విన్నారా?" అంటూ భర్తని గద్దించింది, సుబ్బమ్మ.

శేషాచలం కొయ్యయిపోయాడు.

మాట రాలేదతనికి.

"హెడ్డాఫీసులో పెద్దదొర నాశ్రయిద్దా మని చెన్నాపట్టణం వెళ్ళారు మీ అల్లుడుగారు, ఇక్కడ యిది యిలా జరుగుతోంది. అయితే, నాకు లేకుండా పోతుం దని కుళ్ళనా, అన్నయ్య క్కాకుండాపోతుం దేమో అని బెంగపెట్టు కోనా" అంటూ గిలగిల్లాడిపోయింది సుందరి.

"అయితే, అల్లుడూ అబ్బాయీ మాత్రమే—" అంటూ యేదో అనబో యాడు శేషాచలం; గాని "వూరుకోండి అన్నారు మాట" అంటూ రుంజుకుంది ముందు సుబ్బమ్మ.

అందుకే గడగడ లాడిపోయాడు శేషాచలం, బెదురుచూపులు చూస్తూ బల్లిలాగ గోడ కంటుకుపోయి.

"ఇక చాలు. తెల్లవారాటప్పటి కింట్లోనుంచి లేవగొట్టేస్తా నాపాపాత్ముణ్ణి. తల్లి చావు పిల్లాడుగదా అని చూస్తూవుంటే నాకన్నతల్లి కడుపుమీద కొడతాడా వీడు. ఇక వూరుకుంటే - చూసుకో" మంటూ పరవళ్ళు తొక్కేసింది, తరవాత, సుబ్బమ్మ, సుందరిని గాలిలో విడిచిపెట్టేసి.

ఆ వుద్ధృతం చూసి "రామా, రామా" అని మాత్రం అని సగం పీట మీదికీ సగం నేలమీదికీ వొరిగిపోయాడు శేషాచలం.

ఇది చూసీ అదిచూసీ తెల్లపోయింది సుందరి.

"కాని "చూశావా?" అంటూ వెంటనే వూచలాగ లేచి "సిద్ధాన్నం! నాన్న నోటి కిక ముద్దపోదు. ఈరకస తెలిసిందంటే అన్నయ్యనోటికి వచ్చి మంచినీళ్ళయినా పో వక్కడ. ఊరుకో, వూరుకో, లేకపోతే నన్ను చంపుకుని తిన్నట్టే" అంటూ గట్టిగా పట్టుకుని తల్లినోరు నొక్కేసిం దామె.

## 4

హోల్డా లొకచేతా, సూటుకే సొకచేతా పట్టుకుని ముందు రిక్షామనిషీ బీడీప్రాణా లెగపీల్చేస్తున్నట్లు పొగలాగుతూ తరవాత, అల్లుడు చలపతిరావూ హాల్లో అడుగుపెట్టాటప్పటికి, అక్కడే కూచుని రేషన్‌బియ్యంలో మట్టిబెడ్డలూ గంత్రయిసకా, వడ్లగింజలూ యేరుతున్న సుబ్బమ్మ, పాద్యంమాటే స్మరించకుండా "ఏం వుద్యోగం దొరికిందా?" అనడుగుతూ లేచినుంచింది, చేట ఒకచోట పెట్టి, ఆశగా చూస్తూనూ.

"ఇంకా లేదండి" అన్నాడు చలపతి, రెయిలింజన్ లాగ యింటికప్పుకి గురిపెట్టి పొగవిడిచి పెడుతూ.

"చేతు లూపుకుంటూ వచ్చావా?" అనడిగింది మళ్ళీ ఆమె కాలేదన్న దిగుల్లేనందుకు నిరాసకంగా చూస్తూ

"అలాగే చెయ్యవలసి వచ్చింది" అన్నా డతను, వెకిలిగా నవ్వుతూనూ, నిర్లక్ష్యంగానూ.

"ఏమన్నా డేమిటి దొర?"

"ఆలోచిస్తా నన్నాడు"

"సరే, అదీ వొకమాటే?"

"..............................."

"నీ క్కానపడ్డాడా, పోనీ?"

"ఆలోచిస్తా నన్నా డన్నాను కాదుటండీ?"

"ఆలోచన కాదు, నాకు తెలుసు. మాద్వారపూడి పచ్చిపా డక్కడికూడా రాసిన ట్టున్నాడు — "

పళ్ళుపటప ట్టాడిస్తూ సుబ్బమ్మ యిలా మాట్టాడుతూ వుండగానే "అదేమి" టనడిగాడు చలపతి, పసుపుకుంకుమలతో కలకల్లాడుతూ వున్న సింహద్వారం గడపమీదికి బీడీబూడిద రాలుస్తూ.

మరో సందర్భం అయితే, అలాంటి అభాజనప్పని చేస్తున్నందు కత ణ్ణయినా దులిపేసివుండునామె; కాని మనసులో మరోమంట మండుతూ వుండి నందున అది గమనించక "మా గోపిగాడు సీమీద పోటీ యేడుస్తున్నాడులే" అంది రుంజుకుంటూ.

అనేసింది కాని యీమాట అవతలివాటాలో వున్న కోడలు కామేశ్వరికి వినపడిపోయిం దేమో అని తెల్లపోయింది కొంచెం; కాని సరిగా ఆసమయానికే అవతలివంటింటోనుంచి పొగుపుమాటు దూసుకువచ్చింది.

దాంతో కుదుటపడిం దామె.

ఈలోపున "ఏమిటి? వివరంగా చెప్పండి" అన్నాడు చలపతి, బీడీ చేత పట్టుకుని పొగ నములుతూ.

ఆగొడవలో యీమాట వినబడలేదామెకి.

అతనికే సయినా చూడలే దామె.

"నాచిట్టితల్లి వుసురు తగలదూ వీడికి?" అని రుసరుసలాడుకుంటూ వంటింటోకి చక్కా పోయిం దామె, బియ్యపు చేట అందుకుని.

తల్లిచాలకం గుర్తించి "అల్లుడుగారు వచ్చారా?" అనడిగింది, సుందరి.

"ఉద్యోగం దొరకలేదుట. నేను చెప్పలేదూ? ఓపిక పట్టమని నానోరు నొక్కేశావు—ఏం కుదిరిందా?"

"పోనీ, అన్నయ్యకి దొరికిం దటనా?"

"దొరకా లని వుందా నీకు?"

అక్కడ జరిగింది తెలియకపోవడం—ఇక్కడ యీవుప్పెన. వీటికి సాయం, తల్లి అహాయిత్యం—మాట్లాడకుండా సుందరి హాల్లోకి బయలు దేరింది.

అలా రుంజుకుంటూనే చెంబుతో నీళ్ళు తెచ్చి సుబ్బమ్మ అటూ యిటూ చూడగా, సుందరీ చలపతీ దక్షిణపు తెరపిలో మాట్లాడుకుంటున్నారు.

"ఎవడికో వొకడి కీవుద్యోగం యివ్వడం యిక్కడ వున్న చిన్నిదొరేట" అన్నాడు చలపతి.

శిరస్సున పిడుగుపడ్డ ట్టయింది సుందరి కీమాటతో.

"శ్రమ అలా వుండగా, యాభై రూపాయలు——వొక్క నెల గ్రాసం—శుష్కదండుగు" అంటూ దేవుళ్ళాడిందామె.

"పోనిస్తూ. దేవుడు మేలుచేస్తే యాభై రూపాయ లొక్క చిల్లిగవ్వకి సమానం. పోతేపోయింది, బెంగపెట్టుకోకు. ఈ దర్బిద్రం యెప్పుడూ వుండేదే'

చాలా దినా లయింది దర్జాగా చెన్నపట్నం చూసివచ్చాను" అన్నాడు చలపతి తల యెగరవేసుకుంటూ.

సుందరి మనస్సు చివుక్కుమంది; కాని జీవనభారం యీ భారం మరిపించగా "ఇక్కడి చిన్నదొరని చూడా లటనా?" అనడిగింది దిగులు కనపడకుండా అణుచుకుంటూ.

"అన్నమాటే"

"ఇతగాడేం పరీక్షచేస్తాడో?"

"చేస్తే? ఊహు! నాకు లక్ష్యమా, కాలేజీఫస్టుగా వచ్చినవాణ్ణి, లెక్కల్లో!"

"..........................."

"పెళ్ళికొడుకు పెళ్ళికూతుర్ని చూసుకోడం యెలాంటిదో, కంపెనీవాళ్ళు దరఖాస్తుదార్లని చూసుకోడం అలాంటిదే, తప్పుతుందా మరీ?

"..........................."

"కాక, — కంపెనీవాళ్ళ వాలకం దరఖాస్తుదారు మాత్రం చూసుకోవద్దూ, నచ్చుతుందో నచ్చదో?"

"నచ్చకపోతే?"

గతుక్కుమన్నాడు చలపతి.

కాని, అంతలో దిటవు తెచ్చుకుని "నచ్చుతుందీ, మనసిచ్చి పనిచేస్తాం. నచ్చదూ, మొగం చాటేస్తాం రసకందాయప్పట్లలో"

"ఇంతా చేసి యీఅపశకునం మాటేమి" టనుకుంది సుందరి.

చూడగా, మొగమంతా గర్వం చేసుకుని చూస్తున్నాడు చలపతి.

ధోరణి మార్చ దలిచి "ఇతగాడు మాత్రం ఆలోచిస్తాననడూ?" అనడిగిందామె.

"అనక? అంతవ్యాపారం చేస్తున్నవాడు, మొగం యెరగనివాళ్ళు వెళ్ళి మీదపడితే చటుక్కున వుద్యోగం యిచ్చేస్తాడా మరీ?" అని యెదు రడిగా డతను.

"..........................."

"ఇంతకీ, — ఆ పెద్దదొరకంటే యీచిన్నదొరే బహూ నిదానమైనవాడుట"

"..........................."

"అసలు సంగతి విన్నావా?"

"ఏమిటీ?" అనడిగిందామె, వులిక్కిపడి చూస్తూ.

"ఆ వొక్క గుమాస్తాగిరీకోసమూ రెండువందలపాతిక దరఖాస్తులు వచ్చివున్నాయి టిప్పటికి"

